**కథ**

# వ్యాపార రహస్యం

దేముడికి పూలదండ కడుతుంటే తను చదువుకొనే రోజులు గుర్తొచ్చాయి జానకికి. కాలేజీకి వెళ్ళేప్పుడు పెద్ద పూలదండ తలలో పెట్టుకోవడం ఎంతో యిష్టమయ్యేది. ఆ పూలు-మల్లెలయినా, చేమంతులయినా, గులాబీలయినా, ఏవయినాసరే జడనిండా పెట్టుకోవాలంతే. పూల విషయంలో ఎవరు వెక్కిరించినా పట్టించుకునేది కాదు జానకి.

పెళ్ళయి అత్తవారింటికొచ్చాక, జానకి పూలు పెట్టుకునే పద్ధతి చూసి వాళ్ళు నవ్వేవారు. కొంచెం కోపం వచ్చినా తగ్గించి పెట్టుకునేది కానీ, పూలు పెట్టుకోవడం మానేదికాదు.

రాజారావుకి పూలంటే యిష్టమే కానీ పూలు చెట్లకుంటేనే అందం అని, అవి కోసి తలలో పెట్టుకుంటే బాగుండదనే భావం మనసులో బాగా నాటుకుపోయింది. మల్లెపూలు కొద్దిగా జడలో వుంటే భరించగలడు కానీ, అన్నిరకాల పూలు జడలో పెట్టుకుంటే, ఎవరన్నాకానీ చాలా కోపం రాజారావుకి.

''ఆడవాళ్ళన్నాక పూలు పెట్టుకోరా!'' జానకి కోపంగా అన్నప్పుడు ''మా చెల్లాయిని చూడు, ఎంత నాజూగ్గా ఒకటో, రెండో పూలు ఎలా పెట్టుకుంటుందో'' అనేవాడు.

తన భర్త ఆఫీసు నుంచి వస్తున్నపుడు, సినిమా నుంచి వస్తున్నపుడు పూలు కొని తీసుకురావాలి తన కోసం అని జానకి ఉద్దేశం. ఆ ఆలోచనే మహా చిరాకు కలిగిస్తుంది రాజారావుకి. భార్యకోసం చీరలు తను కొని తేవడం కూడా యిష్టం వుండదు.

''నీకు కావలసినవి నువ్వు కొనుక్కో'' అంటాడంతే.

తన అన్నయ్య వదిన కోసం చీరలు తనే సెలెక్టు చేసి తెస్తాడు. పూలు కొని తెస్తాడు. అంతేకాదు ఏ వూరన్నా వెళ్ళినపుడు ''మీ వదినకి యివి ఎంతో బాగుంటాయని ఈ గాజులు తెచ్చాను'' అని ఎన్ని సార్లు అన్నయ్య చెప్పటం వింది జానకి.

రాజారావు పద్ధతి మొదట్లో మనసుకి చాలా బాధ కలిగించినా, నెమ్మది నెమ్మదిగా అతని తత్త్వమే అంత అని సర్దుకుపోయింది జానకి. కానీ భర్త పూలు కొని తనకియ్యాలి అనే చిన్నకోరిక అంతరంగంలో అలానే వుంది.

''బజారుకెళ్ళి పూలు కొని నీకు తెచ్చియిచ్చే కోరిక తప్ప మరేదయినాసరే కోరుకో, క్షణాల్లో తీరుస్తాను'' పెళ్ళికి బయలుదేరివెడుతూ భార్యతో అన్నాడు రాజారావు. జానకి మాట్లాడలేదు. మరే కోరికా కోరుకోనూ లేదు. ''ఏదో కారణం వుండి వుంటుంది. కాకపోతే యింత విముఖత్వమేమిటి?'' జానకి మనసులో నిశ్చయించుకుంది.

కాలం గడుస్తోంది. జానకి కాపురానికొచ్చి రెండేళ్ళయింది. పూల విషయంలో భర్తతో ఘర్షణ పడటం అనవసరం అని ఒక నిశ్చయానికొచ్చేసింది.

హాల్లో సోఫాలో కూర్చుని శ్రద్ధగా నవల చదువుకుంటోంది జానకి. జడ ముందరకేసుకుంది. నల్లని పొడుగాటి జడ నిగనిగలాడుతుంది. జడలో రెండే రెండు సన్నజాజులు కనిపించాయి రాజారావుకి. ఒక్కసారి నవ్వొచ్చింది. 'నీ నల్లని వాల్జెడ లోపల మల్లియనై విరియాలని'- ఏదో పాట లీలగా గుర్తొచ్చి, మళ్ళీ శ్రద్ధగా జానకి వంకే చూశాడు రాజారావు. కాపురానికొచ్చినపుడు సన్నగా వుండే జానకి కొంచెం వళ్ళు చేసిందంతే. నల్లని నొక్కునొక్కుల జుట్టు ముఖానికెంతో అందాన్నిస్తోంది. జానకి జడ ముందుకు వేసుకుని నవల చదువుకుంటూనే వుంది. రాజారావుకి ఒక్కసారి అనిపించింది.

ఆ నల్లని జడలో తెల్లని మల్లెపూల దండ!

అదీ తను కొనిపెట్టాలి. ఎంత చిన్నకోరిక. ఆ కోరిక తను తీర్చకపోవడమేమిటి! పాపం జానకి ఎంత మంచిది. తనకోసం ఎన్ని సర్దుకుపోతోంది. అలాంటి, జానకి చిన్న సరదా తను ఎందుకు తీర్చడు. భార్యకి పూలు కొనిపెట్టడంలో గొప్ప థ్రిల్లు ఉందంటాడు తన ఫ్రెండు, ఏమో తనకి పరమచిరాకు. రాజారావు మళ్ళీ జానకి వైపు చూశాడు. జడ ఏదీ, లేదే, జానకి జడ వెనక్కి వేసుకుంది. పుస్తకం మూసేసి లేచింది.

ఇవ్వాళ జానకి కోరిక తీర్చాలని గట్టిగా అనుకున్నాడు రాజారావు.

''ఇలారా!'' అంటూ జానకి పొడవాటి జడ తన చేతిలోకి తీసుకున్నాడు.

''అలా బయటికి వెళ్ళొద్దాం, గబగబా రెడీకా''

జానకికి రాజారావుతో కలిసి బజారుకో, సినిమాకో, స్నేహితుల యిళ్ళకో, హోటళ్ళకో వెళ్ళటం యిష్టమే. ఈమధ్యే ఎందుకో ఇంట్లోంచి బయటకి వెళ్ళడం కుదరటంలేదు. జానకి గబగబా పదినిముషాల్లో తయారయింది.

జానకి, రాజారావు ఇంట్లోంచి బయలుదేరారు. ఎక్కడికి వెళ్తున్నాం అని జానకి అడగలేదు. అతను చెప్పలేదు. ఆటోని ఆపి రాజారావు నడుస్తుంటే, వెనకే జానకి నడిచింది.

ఎక్కడికీ-

ఆశ్చర్యం-రాజారావు పూల దుకాణం దగ్గిర ఆగాడు.

జానకి గబగబా నడవాలనుకుంది. మళ్ళా ఈ పూలు ప్రశాంతంగా వున్న తన మనసుని బాధిస్తాయి. రాజారావుకి యిష్టంలేని పని తను చేయించటం ఎందుకూ! జానకి అలా చూస్తోంది. రాజారావు పూలు కొంటున్నాడు. తన కళ్ళను తనే నమ్మలేకపోయింది జానకి. గబగబా రాజారావు పక్కకు వెళ్ళి నిలుచుంది. ఈరోజా తన కోరిక తీరుతోందా! ముఖం నిండా ఆనందం నిండిపోయింది.

''మూర రూపాయిన్నర ఏవిటీ! రూపాయికి యివ్వు'' అంది పూలవాడితో.

పూలవాడు జానకి వంక చూస్తూ ''రోజా అయ్యగారు యిక్కడే కొంటారు. యివ్వాళ బేరం ఏంటీ'' అన్నాడు పూలు ఆకులో చుడ్తూ.

''ఏమిటీ'' జానకి రెట్టించింది.

''రోజా కొనేచోట బేరం ఏమిటి అమ్మగారూ! అయ్యగారు ఏరోజూ బేరం ఆడరు'' పూలవాడు పూలు గుచ్చుకుంటున్నాడు తలొంచుకుని. వాడి చేతిలో రూపాయిన్నర పెట్టాడు రాజారావు.

''ఏమంటున్నాడు'' అంది జానకి రాజారావు పూలపొట్లాం చేతిలో పెడుతుంటే.

''ఏమో-ఎవడు విన్నాడూ, ఏమన్నాడో''

ఆ పూలు చూసి జానకి మురిసిపోతుందని, ఆమె ముఖంలో కనిపించే ఆనందం చూడాలని ఎంతో తృప్తిగా జానకి ముఖంలోకి చూశాడు రాజారావు.

వర్షిస్తుందనుకున్న మేఘం, పెద్దగా ఉరిమినట్లుగా, ''ఇది తీసుకోండి'' పూలపొట్లం రాజారావు చేతిలో పెట్టింది. గట్టిగా అరిచి ఆ పొట్లం చేతిలో వుంటే తేళ్ళు, జర్రులు పాకినట్లుంది జానకికి.

రాజారావు మొఖం వెలవెలబోయింది. తనేం తప్పు చేశాడు. ''ఇంకో రెండుమూరలు కావాలా! కొనుక్కో..''

''అక్కర్లేదు'' జానకి గబగబా నడిచింది.

రాజారావుకి నిజంగా అర్థం కాలేదు, ఏం పొరపాటు జరిగిందో.

ఇళ్ళు చేరారిద్దరూ. ''నామీద కోపం పోలేదా జానీ!'' లాలనగా భుజంపై చెయ్యి వేశాడు.

''నాకేం కోపం. జానకి వాల్జెడను ముడిగా చుట్టుకుంది. ఇప్పుడు నాకర్థమైంది. మీకు పువ్వులంటే ఎందుకిష్టంలేదో. నాకోసం పూలు కొని తేవడం మీకెందుకు నచ్చదో తెలిసింది'' వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుంటూ అంది.

''అంటే!''

''కాకపోతే అంత ఖచ్చితంగా వాడెందుకంటాడు.''

''వాడెవడు?''

''రోజా అక్కడే కొంటున్నారని వాడు చెప్పలేదు! పైగా బేరం కూడా ఆడరటగా''

కోపంలో మరీ అందంగా కనిపించింది రాజా


రావు కళ్ళకి జానకి.

''ఇంకా ఏం చెప్పాడు?'' నవ్వుతూ అన్నాడు.

''ఇంకా ఏం చెప్తాడో అనేగా గబగబా నడిచి వచ్చేశారు'' ఈమాటు రాజారావుకి నవ్వు ఆగలేదు. విషయం అర్థమై పోయింది.

''ఓ! అదా! అదే వ్యాపార రహస్యం. ఎవరు, ఎక్కడ ఏది కొనడానికి వెళ్ళినా అమ్మేవాడు అలానే అంటాడు. వాడు అలవాటుగా అన్నమాటని నీవు నిజం అనుకుని నాతో పోట్లాడటమేమిటి! జానీ-ఒక్కసారి ఆలోచించు.''

రాజారావు బ్రతిమాలాడు. ఎన్నో ఉదాహరణలు చూపించాడు. ఏమైనా జానకి మనసు అంగీకరించలేదు. అనుమాన బీజం ఆక్షణంలో మహావృక్షమైపోయింది.



రోజా ఎవరికిస్తున్నారో! ఆఫీసులో పనెక్కువయింది. ఆలస్యం అయిందంటే నిజమే అనుకుంది. షర్టు కాలరుపైన గులాబీ రేకులు చూసి, యిదేమిటీ అంటే నా ఫ్రెండుకేసిన పూలదండని నా భుజంపైన వేశాడు అంటే, అవునేమోలే అనుకుంది. స్నేహితులతో పిక్‌నిక్‌కి వెళ్తున్నాను, రాత్రికిరాను అంటే పోన్లే వెళ్ళనీ అనుకుంది. చివరికి యిదన్నమాట. జానకి మనస్సు ఆలోచిస్తున్నకొద్దీ రాజారావు మాటలన్నీ అబద్ధాల్లాగే అనిపించాయి. పూలకొట్టు దగ్గరకు వెళ్ళి రోజా ఎన్నెన్ని మూరలు కొంటున్నారో, ఎన్నేళ్ళనుంచి కొంటున్నారో, ఖచ్చితంగా తెలుసుకుని రావాలని చాలా కసిగా అనుకుంటూ చెప్పులు తొడుక్కుని బయలుదేరింది జానకి. కాని క్షణంలో లోపలికొచ్చి చెప్పులు విప్పేసింది.

చిన్న గులకరాయి చాలుకదా నిర్మలంగా, నిశ్చలంగా వున్న నీటిని కలచివేయడానికి.

భార్యాభర్తల మధ్య రోజురోజుకి దూరం ఎక్కువయింది. నిశ్శబ్దం రాజ్యం ఏలుతోంది. రెండు వారాలు గడిచాయి. తెల్లవారుజామున వీధి గేటు చప్పుడవుతోంది.

రాజారావు విననట్లు వూరుకున్నాడు. జానకి కూడా విననట్టు వూరుకుంది. గేటు చప్పుడు ఎక్కువయింది. ''తలుపు తియ్యొచ్చుగా'' అంది. ''నువ్వు తియొచ్చుగా.''

జానకి విసురుగా లేచి గబగబా వెళ్ళి గేటు తీసింది. ''ఏమిటీ అంత మొద్దునిద్ర'' కిరణ్ లోపలికొస్తూ బ్యాగ్ జానకి చేతికందించాడు. మూడేళ్ళ తర్వాత అన్నయ్య కిరణ్‌ని చూడటం యిదే. వారం రోజులు పనిమీద హైదరాబాద్ వెళ్ళాలంటే ఆఫీసరు ముందు ఎగిరి గంతేశాడు కిరణ్.

రాజారావు క్లాస్‌మేట్ కిరణ్. కాఫీ తాగుతూ ఎప్పటెప్పటి కబుర్లో చెప్పుకుంటుంటే జానకికి ఎంతో హాయిగా అన్పించింది. భార్యాభర్తల మధ్య వున్న కోపాలు ఆ క్షణం ఎటో పొయ్యాయి. రెండ్రోజులు తర్వాత షాపింగ్‌కని బయలుదేరిన కిరణ్ చెల్లెల్ని వెంటబెట్టుకుని వెళ్ళాడు. ఢిల్లీలో వుండే కిరణ్ భార్యకి హైదరాబాద్ గాజులు, చీరలు చాలా యిష్టం. అవన్నీ కొనడం అయ్యాక సుల్తాన్ బజారులో నడుస్తూ ''ఉండుండు నీకు చాలా యిష్టమైనవి కొంటాను'' అన్నాడు చెల్లాయితో.

అదే కొట్టువాడే, ఆరోజా పూలు రాజారావుకి అమ్మినవాడే. జానకి గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

''తీసుకోండి సార్. మూర మూడు రూపాయలు'' మాల మూరెడు కొల్చాడు. ''అబ్బో చాలా ఖరీదే. రెండ్రూపాయల కియ్యి'' అన్నాడు కిరణ్.

''ఏమిటి సార్! రోజా నాదగ్గరే తీసుకుంటారు. ఏరోజూ బేరం ఆడరు'' తల పైకెత్తకుండానే పూలమాల ఆకులో చుట్టి కిరణ్ చేతికందించాడు. జానకి తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది. రోజా యిక్కడే కొంటాడా అన్నయ్య. రెండు రోజులనాడు యిక్కడకొచ్చిన అన్నయ్య, మూడేళ్ళ తర్వాత వచ్చిన అన్నయ్య-రోజా యిక్కడే కొంటాడా? జానకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్. మంచి మనస్సుని ఎంతగా గాయపర్చింది. జానకి ఎటో చూస్తోంది.

''చూశావా జానకి! ఇదీ వ్యాపార రహస్యం. అంతే. వాడిదగ్గర నేను రోజా కొంటున్నానట. ఇంకా నయం. మీ వదిన వినలేదు వీడి మాటలు'' పెద్దగా నవ్వుతూ పూలపొట్లం చెల్లాయి చేతిలో పెట్టాడు కిరణ్. ఉలిక్కిపడింది జానకి.

ఇల్లు చేరిన జానకి, గబగబా పడక గదిలోకెళ్ళింది. గాఢనిద్రలో వున్న రాజారావు గుండెలపై వాలిపోయింది. రాజారావు కౌగిలిలో ఉక్కిరి బిక్కిరవుతున్న జానకి జడలో తెల్లని మల్లెలు గుప్పుమని గుసగుసలు చెప్పుకున్నాయ్.

★

**డాక్టర్ ముక్తేవి భారతి**